# గర్భగుడి

"ఏవిటే నువ్వనేది?" నిశ్చేష్టురాలై చూస్తూ అంది మంజుల.

నిర్లక్ష్యంగా చూస్తూ, "అవునమ్మా... నాకిష్టంలేదు" మొండిగా అంది తనూజ..

"ఏవిటే ఇష్టంలేదు?"

"పిల్లల్ని కనడం, పెంచడం, బాధ్యతలు... కష్టాలూ... ఇవన్నీ నాకిష్టంలేదు"

"మరి పెళ్ళెందుకు చేసుకున్నావు?"

"పెళ్ళి చేసుకున్నది నా కోసం. పిల్లల్ని కనడం కోసం కాదు. పిల్లల్ని కనడం కర్తవ్యం అన్నట్లు మాట్లాడతారేం"

"అవును, కర్తవ్యమే. అందుకే నోర్మూసుకుని కూర్చోమనేది. పిచ్చిపిచ్చిగా మాట్లాడకుండా వెళ్ళి పడుకో. అసలే వాంతులతో బాగా నీరసంగా ఉన్నావు."

మంజుల అక్కడినుంచి వెళ్ళబోతుంటే "అందుకే... అందుకే ఈ వాంతులు, వేవిళ్ళు ఉంటాయనే నాకసహ్యం. మా కాలేజీలో పెద్ద పొట్టేసుకుని తిరిగేవాళ్ళని చూసి ఏడిపించేవాళ్ళం, నవ్వుకునేవాళ్ళం. అలాంటిది ఇప్పుడు నేను కూడా అలా పెద్ద పొట్టేసుకుని తిరగాలా? ఛీ... ఛీ..." అంటూ గట్టిగా అరుస్తూ వికారంగా మొహం పెట్టింది తనూజ.

మంజుల కూతురి వైపు విచిత్రంగా చూసింది. ఇది చిన్నపిల్లా, పెద్దపిల్లా, అమాయకురాలా. మూర్ఖురాలా? ఏం మాట్లాడుతోంది? ఉదయాన్నే 'అమ్మా నాకు ఒంట్లో బాగోలేదు. ఏం తినాలనిపించడంలేదు. తింటే వాంతి అవుతోంది" అని ఫోన్ చేస్తే గాభరాపడుతూ వెళ్ళి కూతుర్ని తీసుకొచ్చి డాక్టర్‌కి చూపించింది.

పెళ్లయిన నాలుగేళ్ళకి తనూజ తల్లి కాబోతోందన్న శుభవార్త చెప్పింది డాక్టర్. ఆ వార్త విని పొంగిపోతుందని, సంతోషంతో ఎగిరి గంతులేస్తుందని, సిగ్గుదొంతరల మధ్య సెలయేరులా సుళ్ళు తిరుగుతుందని, 'అమ్మా నాకు సిగ్గేస్తోంది, రాహుల్‌కీ, డాడీకి నువ్వే చెప్పు ఈ శుభవార్తని' అంటుందని ఆశించింది. కానీ హాస్పిటల్ నుంచి రావడమే మొహం ముటముటలాడించుకుంటూ వచ్చింది.

వస్తూనే "ఈ ప్రెగ్నెన్సీ నాకొద్దు... అబార్షన్ చేయించుకుంటాను" అంది.

ఆ మాట వినగానే ముందు తెల్లబోయింది మంజుల. పెళ్ళి అయిన దగ్గర్నించీ ఇంకా గర్భం రాలేదు. నేనీ జన్మలో తల్లినవుతానా? అంటూ బెంగ పెట్టేసుకుని డాక్టర్ల చుట్టూ, నోములూ, వ్రతాలూ చేస్తూ, స్వాములవార్ల చుట్టూ తిరిగే ఆడవాళ్ళని చూసింది కానీ... ఇదేంటి ఇదిలా మాట్లాడుతోంది. దీనికేం పిచ్చిపట్టిందా? అనుకుని ఆశ్చర్యంగా చూసింది. ఆవిడ ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా మొండిగా, "నాకీ కడుపు రావడం, పిల్లలు పుట్టడం ఇష్టంలేదు" అంటోంటే ఏం సమాధానం చెప్పాలో ఆవిడకి అర్థంకాలేదు.

ప్రతి ఏడాది తనూజ అత్తగారు ఈ ఏడాదన్నా మాకు మనవడినిస్తావా తనూజా? అని ఆశగా అడగడం, తనూజ సమాధానం చెప్పకుండా అక్కడినుంచి వెళ్ళిపోవడం గమనిస్తున్నా సిగ్గనుకుంది. చిన్నవాళ్ళు కదా... కొన్నాళ్ళు ఎంజాయ్ చేద్దామని ఆగారేమో, ఏవన్నా జాగ్రత్తలు తీసుకుంటున్నారేమో అనుకుంది కానీ ఇప్పుడు ఈ పిల్ల ధోరణి చూస్తుంటే ఏదో కావాలనే పిల్లలు కలక్కుండా తాత్సారం చేసినట్టుంది అనిపిస్తోంది. కూతురి పెంకితనం, ఆధునిక పోకడలూ తెలిసింది కాబట్టి మంజుల కూతురి మాటలు పెద్దగా సీరియస్‌గా తీసుకోకుండా తేలిగ్గా "తప్పు తల్లీ! ఇన్నాళ్ళకి తల్లికాబోతూ ఏమిటా మాటలు? వేవిళ్ళు ఎన్ని రోజులుంటాయి? మూడోనెల దాటగానే తగ్గిపోతాయి. ఈమాత్రానికి పిల్లలు వద్దనుకుంటారా ఎవరన్నా? మేమంతా కనలేదూ?" అంది.

"మీకంటే తెలివిలేదు. పిల్లల్ని కనడం కోసమే పెళ్ళిళ్ళు చేసుకున్నారు మీరంతా. అందుకే కన్నారు. కానీ నావల్లకాదు. నాకు ఈ కడుపులూ, పిల్లలూ, వాళ్ళని పెంచడాలూ, వాళ్ళ ఉచ్చలు, ఉమ్ములు, రోగాలూ, రొష్టులూ, ఈ టెన్షన్ నేను భరించలేను. ఇప్పుడు హాయిగా ఉన్నదాన్ని కష్టాలు కొనితెచ్చుకోలేను. రేపు అబార్షన్ చేయించుకుంటానంతే" విసురుగా అంది తనూజ.

ఆవిడ రెప్పవేయకుండా కూతుర్నే చూడసాగింది. ఒక్కతే కూతురని ఆడింది ఆట, పాడింది పాటగా పెంచారు. కోరుకున్న ప్రతీదీ క్షణాల్లో అమర్చాడు తండ్రి. ఆఖరికి ప్రేమించినవాడిని తప్ప ఇంకెవర్నీ పెళ్లి చేసుకోనని చెబితే కులంలోను, అంతస్థులోను కూడా సరితూగనివారైనా పిల్లాడు బాగున్నాడని, మంచి ఉద్యోగం ఉందని అతనికే ఇచ్చి ఆడంబరంగా పెళ్ళి చేశారు. అల్లరి, గారాబం, పెంకితనం, వీటితో మొన్నమొన్నటి దాకా తన చేతుల్లో పెరిగి, తన చేతిముద్దలు తిన్న కూతురు హఠాత్తుగా పెద్దదై, ఓ ఇంటి కోడలిగా, ఓ వ్యక్తికి భార్యగా వెళ్ళడం అంతా

విచిత్రంగా ఏదో అద్భుతంగా అనిపించింది. అలాగే ఇప్పుడు ఈ చిన్నారి తల్లి, ఓ చిన్నారికి తల్లి కాబోతోందంటే ఆ అనుభూతి వర్ణించడానికి మంజులకి భాష లభించలేదు ఇప్పుడు కూడా తనూజ అన్నమాటలు చిన్నపిల్ల చేష్టలుగానూ, పెంకిమాటలుగానూ అర్థం చేసుకుని కొట్టి పారేయడానికి ప్రయత్నిస్తోంది.

అందుకే "తనూ! నువ్వింకా చిన్నపిల్లవి కాదు, ఊరికే గొడవ చేయకుండా వెళ్ళి పడుకోమ్మా, నీకేదన్నా పుల్లటి పదార్థం పెట్టనా?" అంది.

"పులుపూ వద్దు, తీపీ వద్దు. నాకేం వద్దు. ఈదరిద్రం వద్దు... అబార్షన్..."

"తనూ" గట్టిగా మందలింపుగా అరిచింది "ఏమిటే ఆ మాటలు? నీకేం పిచ్చా?"

"అవును పిచ్చే. నువ్వేమైనా అనుకోమమ్మీ! రానురానూ పెద్ద పొట్ట వస్తుంది. ఆ పొట్టేసుకుని ఆఫీసుకెళ్ళాలంటే నాకహ్యం. నన్ను చూసి అందరూ నవ్వుతారు. నిక్‌నేమ్స్ పెడతారు. అమ్మో... ఊహిస్తుంటేనే కంపరం పుడుతోంది. నాకీ ప్రెగ్నెన్సీ వద్దు"

"అబార్షన్ చేయించుకుని మీ అత్తగారికి, మామగారికీ ఏం సమాధానం చెప్తావు?"

"వాళ్ళకేంటి సమాధానం చెప్పేది... నా ఇష్టం"

"కాదమ్మా... కొన్ని విషయాల్లోనే నీ ఇష్టం చెలామణీ అవుతుంది... పాపం నాలుగేళ్ళనుంచీ వంశోద్ధారకుడి కోసం ఎదురుచూస్తున్నారు వాళ్ళు. ఇప్పుడీ వార్త తెలిస్తే ఎంతో సంతోషిస్తారు. అలాంటి వాళ్ళ సంతోషాన్ని నాశనం చేస్తావా?"

"వాళ్ళ సంతోషం కోసం నేను దుఃఖం ఎందుకు కొని తెచ్చుకోవాలి మమ్మీ"

"నీకు దుఃఖం ఎందుకే. పిల్లలు లేనివాళ్ళు లేరు మొర్రో అనిగుళ్ళూ, గోపురాలూ తిరుగుతుంటే నువ్విట్లా మాట్లాడతావు. మాతృత్వం స్త్రీకి వరం తెలుసా!"

"ఆ... తెలియకేం?" వెటకారంగా అంది తనూజ.

"మాతృత్వం వరం. సంసారం స్వర్గం, ఇల్లే వైకుంఠం, అమ్మా... ఇవన్నీ చాలా పాత చింతకాయ పచ్చడి స్లోగన్స్. దయచేసి నా దగ్గర మాట్లాడకు. మీకు వరం అయితే నా దృష్టిలో ఇది శాపం. నా స్వేఛ్ఛను హరించే శాపం. నాకు మాత్రం ఈ వరాలు వద్దు. ఏం వద్దు. నేను రేపే వెళ్ళి అబార్షన్ చేయమని

డాక్టర్ని అడుగుతాను. ఛీ... ఛీ... పెళ్ళి చేసుకుంటే చాలు పిల్లలు... పిల్లలని ప్రాణం తీస్తారు మీ పెద్దవాళ్ళు. వేరే పనీపాటాలేదు. అక్కడికి మేం మీకు పిల్లల్ని కనడానికి పెళ్ళిళ్ళు చేసుకున్నట్లు. నేను పెళ్ళి చేసుకున్నది పిల్లల్ని కనడానికి కాదు. నేను జీవితాన్ని అనుభవించడానికి, ఆనందించడానికీ తెలిసిందా?"

బ్రాన్పడి చూసింది మంజుల. నిజంగానే దీనికి పిచ్చిపట్టింది అని నిర్ధారించుకుంది. స్వరంలో కొంచెం కాఠిన్యం నింపుకుని, "తనూ! నాకు తెలియదు. సాయంత్రం మీ ఆయనొచ్చాక మీరూ, మీరూ నిర్ణయించుకోండి. ప్రస్తుతం నేను చెప్పినట్టు విను. అంతే... చదవేస్తే ఉన్న మతిపోయినట్లు తయారవుతున్నావు. మొగుడు కావాలి... కానీ పిల్లలొద్దు. రేపు అబార్షన్ చేయించుకున్నాక మళ్ళీ మొగుడి పక్కలో పడుకోకు" అంది.

"అమ్మా! అసహ్యంగా మాట్లాడకు" కోపంగా అరిచింది తనూజ.

"ఏం నువ్వు అసహ్యంగా ప్రవర్తించగా లేనిది నేను అసహ్యంగా మాట్లాడితే తప్పా. కడుపొద్దు. పిల్లలొద్దు. మొగుడుకావాలి... ఇదేనా మీ ఆధునికత? ఇదేనా మీ ఫెమినిజం? మేమూ మీలా అనుకుని ఉంటే మీరెక్కడుండేవాళ్ళు. అన్నీ వెధవాలోచనలు" విసవిసా వంటగదిలోకి వెళ్ళిపోయింది మంజుల.

తల్లి అలా విసురుగా వెళ్ళిపోవడంతో తనూజకి ఒళ్ళు మండిపోయింది. ఏవిటి ఈవిడ ఉద్దేశం? పిల్లల్ని కనడం తనిష్టం. కనాలనిపిస్తే కంటుంది. లేదంటే మానుతుంది. వీళ్ళ నిర్బంధం ఏంటి? పిల్లల్ని కనే విషయంలో తనకేం స్వాతంత్ర్యం, స్వేచ్ఛా లేవా? వీళ్ళు కనమంటే కనాలా? ఈ వాంతులు, ఈ వికారాలు, ఈ బాధలు ఇవన్నీ వాళ్ళు అనుభవిస్తారా? తనేగా అనుభవించాలి. మనవడు కావాలిట... మనవడు. అందులో కూడా నిర్ణయాలు వాళ్ళవే. ఏం, మనవరాలు ఎందుకొద్దు? హు... ఛస్తే కనకూడదు. వాళ్ళ వంశం నిలపడం కోసం తను తొమ్మిది నెలలు భారం మోస్తూ కదలలేక కదులుతూ, నడవలేక నడుస్తూ అసహ్యంగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తూ ఆఫీసుకెళ్లాలా? కొలీగ్స్, ఫ్రెండ్స్ చూస్తే ఏమనుకుంటారు? నో... ఎట్టి పరిస్థితుల్లోనూ తను కనదుగాక కనదు. తీవ్రంగా నిశ్చయించుకుంది తనూజ.

కొన్ని నిమిషాలకి మంజుల గ్లాసుడు నీళ్ళలో నిమ్మకాయరసం పిండి, రెండు చెంచాల తేనె కలిపి తీసుకొచ్చింది. "ఇదిగో ఇది తాగు. వికారం తగ్గుతుంది" అంటూ గ్లాసు తనూజ చేతికివ్వబోయింది.

"నాకొద్దు" మొహం తిప్పుకుంది తనూజ.

తనూజ మీద ఆవిడకి కోపం రాలేదు. ఆ పెంకితనానికి తల్లి మనసు ముచ్చటగా నవ్వుకుంది. బొత్తిగా చిన్నతనం పోలేదు. ఎలాగో ఏంటో అనుకుంది. అందుకే నెమ్మదిగా నచ్చచెపుతున్న ధోరణిలో మృదువుగా అంది. “నా తల్లి కదూ... మొండితనం చేయకమ్మా! నీకు తెలియడంలేదు. భగవంతుడు నీమీద పెట్టిన ఈ బాధ్యత ఎంత గొప్పదో తెలుసా? నువ్వు మరో ఏడు నెలల్లో సృష్టికి ప్రతి సృష్టి చేయబోతున్నావురా! ఈరోజు నుంచీ ఈ కడుపు మామూలు కడుపు కాదు. ఇదొక దేవాలయం. నువ్విక్కడ ఓ జీవికి ప్రాణప్రతిష్ట చేస్తున్నావు. అందులో ఉన్న జీవిని దేవతారూపంగా భావించి, సకల మర్యాదలు చేయాలి. నీ ఆశలూ, కోరికలూ, సహనం, శాంతి, ఓపికా అన్నీ దీనికోసమే కేటాయించాలి. నీకంటూ వేరే వ్యాపకం లేకుండా నీ ఈ గర్భాన్ని ఓ దేవాలయంలా కాపాడాలి. గుడిలో దేవుడికి నైవేద్యం పెట్టకుండా మాడుస్తావా? అలాగే నీ పాపాయిని కూడా మాడ్చకూడదు. పాపాయి ప్రస్తుతం దైవంతో సమానం. నా మాట విని ఇది తాగు.”

“తాగను... తాగను” మంచం మీద దూరం జరిగింది తనూజ.

మంజుల కోపంగా, “తాగకపోతే మానెయ్. నాకేంటి? వాంతులయ్యేది నాక్కాదు నీకే. అవి తగ్గాలంటే ఇది తాగాలి. లేదంటే అలా వాంతులు చేసుకుంటూ కూర్చో” అంటూ లేచి గ్లాసు మంచం పక్కనే ఉన్న స్టూలుమీద పెట్టి వంటగదిలోకి వెళ్ళిపోయింది. ముందు భర్తకి, వియ్యాలవారికి ఫోన్‌చేసి శుభవార్త తెలియచేసింది. వియ్యపురాలు శాంతి ఎంతో సంతోషించింది.

“అబ్బాయికి చెప్పారా వదినగారూ ఈ వార్త?” అని అడిగింది.

“లేదండీ... మనం చెబితే అతనికేం థ్రిల్. తనే చెప్తుంది. ఇప్పుడే వచ్చాం డాక్టర్ దగ్గర్నుంచి. బాగా వాంతులై ఉంది కదా! కాస్సేపు రెస్ట్ తీసుకోమన్నాను. లేచాక తనే చెప్పుకుంటుందిలెండి” అంది.

రాహుల్ ఫోన్‌చేసి, “ఆంటీ, డాక్టర్ దగ్గరకు వెళ్ళారా? ఏమన్నారు? తనూ ఎలా ఉంది?” అని అడిగినా, “బాగానే ఉంది రెస్ట్ తీసుకుంటోంది” అని చెప్పిందే కానీ విషయం చెప్పలేదు.

భర్తా, అల్లుడూ సాయంత్రం ఆఫీసు నుంచి ఇటే వస్తారని అప్పటికప్పుడే ఆవిడ చకచకా మైసూర్‌పాక్, చేగోడీలు చేయడానికి ఉపక్రమించింది.

మంజుల పని అయ్యేటప్పటికి ప్రసాద్ వచ్చేశాడు.

వస్తూనే కూతురి మంచం దగ్గరికి వెళ్ళి తను తెచ్చిన స్వీటు తనూజ నోటికి అందిస్తూ, "కంగ్రాట్స్ రా నన్ను తాతని చేసేస్తున్నావా అప్పుడే" అన్నాడు.

తనూజ ఏడుపు స్వరంతో అంది, "ఏంటి డాడీ నువ్వు కూడా... నీకింకా పార్టీఫైవ్ ఇయర్స్ కూడా లేవు. అప్పుడే ముసలాడిలా తాత అనిపించుకోడానికి ఆరాటపడతావేం నాకిష్టంలేదు డాడీ..."

"ఏంటమ్మా... ఏంటిష్టంలేదు? తప్పదురా... నువ్వు మరీ త్వరగా పెళ్ళి చేసుకున్నావు. నేను త్వరగా తాతనవుతా. దానికేం ఉంది. గ్లామరస్ తాతని అనిపించుకుంటే నాకెంత క్రెడిట్" అన్నాడు మురిపెంగా. తనూజ నుదుటి మీద పడిన జుట్టు సవరిస్తూ.

"నో... నాకిష్టంలేదు. ఐ జస్ట్ వాంట్ టు గో ఫర్ అబార్షన్"

ఏం అర్థంకానివాడిలా అయోమయంగా భార్యవైపు చూశాడు ప్రసాద్. అతని చేతికి కాఫీ గ్లాసు అందిస్తూ అంది మంజుల.

"ఇదీ వరస... ఇందాకట్నించి ఈ వాగుడే వాగుతోంది."

ప్రసాద్ కాఫీ గ్లాసు స్టూలుమీద పెట్టి నచ్చచెపుతున్నట్లుగా అన్నాడు. "తప్పు నాన్నా... తప్పు. ఈ మాట మొదటిసారి తల్లి కాబోతున్న స్త్రీ నోటినుంచి పొరపాటున కూడా రాకూదు. తల్లికావడం అంటే మాటలా!"

"హు... ఏం? పిల్లల్ని కనడం పెద్ద ఘనకార్యమా? పక్షులు, పశువులు కూడా కంటాయి" విసురుగా అంది.

"అదే... అందుకే అంటున్నాను. పక్షులు, పశువులూ నామర్దాగా భావించని పనిమనిషివై అదీ ఆడదానివై పుట్టి నువ్వెందుకు నామర్దాగా భావిస్తున్నావు?" అవకాశం వచ్చింది కదా అని నిలదీసింది మంజుల.

"మనిషిని కాబట్టే దేశంలో జనాభా పెరిగిపోతూ దారిద్ర్యం పెరిగి పోతోందని నావంతు కర్తవ్యంగా జనాభా పెరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటు న్నాను."

"ఆహా... ఎంత గొప్ప సివిక్ సెన్సే నా తల్లీ! చాలుగానీ పిచ్చివేషాలేయకు" వెటకారంగా అని ప్రసాద్ వైపు చూస్తూ అంది, "మీరు ఇలా రండి, దాని దగ్గర కూర్చుంటే మనకీ పిచ్చెక్కుతుంది."

బైట స్కూటర్ ఆగిన శబ్దం అయింది.

"అదుగో రాహుల్ వచ్చాడు. ఇంక నీ ఇష్టం ఏం చెప్పుకుంటావో చెప్పుకో"

అంది మంజుల ఇంక నాకేం సంబంధంలేదు అన్న ధోరణితో.

రాహుల్ స్కూటర్ పార్క్‌చేసి లోపలకి వచ్చాడు. వస్తూనే గుమ్మంలో ఎదురైన మంజులని చూస్తూ ఆత్రంగా అడిగాడు. "ఆంటీ తనూ ఎలా వుంది? ఏమైంది?"

ప్రసాద్ అతని కంగారు చూసి ఆశ్చర్యంగా అడిగాడు మంజులని. "ఏంటి తెలియదా?"

లేదన్నట్టు చూసింది మంజుల.

"ఏంటంకుల్" అడిగాడు రాహుల్ అయోమయంగా.

ప్రసాద్ నవ్వుతూ అతని భుజంతట్టి "కంగ్రాట్స్ రాహుల్. నువ్వు నాన్నవి కాబోతున్నావు" అన్నాడు.

తనూజ ముఖం చిట్లించింది.

రాహుల్ అదేం పట్టించుకోకుండా చెదిరిన ఆమె ముంగురులు సవరిస్తూ "పాపం! ఇందుకా అలా వాంతులు చేసుకుంటున్నావు. నాలుగు రోజుల్నించి తిన్నదేదీ వంటపట్టకుండా! ఓకే... నీకేం కావాలో చెప్పు ఇప్పుడే తెస్తాను."

వాళ్ళిద్దరినీ ఒంటరిగా వదిలి మంజులా, ప్రసాద్ అవతలికి వెళ్ళిపోయారు. కానీ మంజుల గుండెల్లో దడగా వుంది. ఈ పిచ్చిది పిచ్చివాగుడు వాగి అతని ఉత్సాహం మీద ఎక్కడ నీళ్ళు చల్లుతుందోనని.

అదే అంది భర్తతో, "ఈ వార్త తెలిసిన దగ్గర్నుంచీ ఇలాగే వాగుతోంది. ఆ మొహంలో సంతోషంలేదు ఏం లేదు. నాకేం అర్థం కావడంలేదు దీని ఉద్దేశం ఏమిటో"

ప్రసాద్ తేలిగ్గా అన్నాడు, "ఏం కాదు, ప్రస్తుతం ఈ వాంతులు, వేవిళ్ళు చూసి అలా ఆలోచిస్తోంది. నాలుగురోజులు పోతే తనే సర్దుకుంటుంది. ఆఫీస్‌కెళ్ళి స్వీట్స్ పంచిపెడుతుంది."

కానీ, అతననుకున్నట్లు జరగలేదు. రాహుల్‌ని బెదిరించి, వేధించి మర్నాడు డాక్టర్ దగ్గరకి వెళ్ళింది తనూజ.

కానీ ఆవిడకి అబార్షన్ చేయడానికి సరైన కారణం కనిపించక రాహుల్‌ని "అబార్షన్ చేయడం నీకంగీకారమేనా?" అని అడిగింది.

అతను చిన్నబుచ్చుకున్న మొహంతో, "నా ఇష్టమేంటి డాక్టర్! మోసేది తను, కనేది తను. తనకా శక్తి లేదంటోంది. నేను బలవంతం చేసి ఏం చేయగలను? నాకు పిల్లలు ఇష్టమైతే ఏ అనాథల్నో తెచ్చుకుని పెంచుకుంటాను"

అన్నాడు నిష్ఠూరంగా.

ఆవిడ తనూజని అడిగింది, “నువ్వెందుకు అబార్షన్ చేయించుకోవాలనుకుంటున్నావు?” అని.

తనూజ మొహం మాడ్చుకుని అంది, “నాకిష్టంలేదు. వీళ్ళందరి కోసం పదినెలలు ఈ భారం మోసి పిల్లల్ని కనడానికి నేనేం యంత్రాన్ని కాదు. అయినా ఇది నా వ్యక్తిగత విషయం. ఇందులో ఎంతమంది అభిప్రాయం కావాలి మీకు. నేను అబార్షన్ చేయమన్నాను చేయండి.”

అనుభవజ్ఞురాలైన డాక్టర్‌కి తనూజ అంతరంగం అర్థం అయిపోయింది. ఆధునిక స్త్రీల విపరీత పోకడలకి ఈ అమ్మాయి మరో నిదర్శనం అనుకుంది. అందుకే అంది, “ఓకే తనూజా! ఇప్పుడేం మించిపోలేదు. తొందరలేదు. నీకు వారంరోజులు టైం ఇస్తున్నాను. మరోసారి ఆలోచించుకుని రా! అప్పుడు కూడా ఇదే అభిప్రాయంతో ఉంటే తప్పకుండా చేస్తాను.”

“ఇంకా వారం భరించాలా ఈ దరిద్రాన్ని” విసుగ్గా అంది తనూజ.

ఈ అమ్మాయి మూర్ఖురాల్లా ఉంది అనిపించిందావిడకి. కోపం అణచుకుంటూ “ఇది కూడా భరించలేకపోతే నువ్వు జీవితంలో ఏదీ భరించలేవు. మరి నిన్ను అందరూ భరించాలి కదా!” అంది.

తనూజకి ఆవిడ మాటలకి కోపం వచ్చింది. తమాయించుకుంటూ తల వంచుకుని బైటకి వచ్చేసింది. ఆమె వెనకాలే పాలిపోయిన మొహంతో వెళ్తున్న రాహుల్‌ని చూస్తుంటే జాలేసింది ఆవిడకి. ఏవిటో ఈ కాలం... అనుకుని నిట్టూర్చింది.

మర్నాడే రాహుల్ ఇద్దరూ వాళ్ళింటికి బయలుదేరారు. డాక్టర్ ఏం అన్నదో మంజుల అడగలేదు. తనూజ చెప్పలేదు. రాహుల్ మొహం చూస్తుంటే మాత్రం ఏదో అతనికి ప్రతికూలంగానే జరిగింది అనిపించింది. చిన్నబుచ్చుకున్న మొహంతో జబ్బుపడ్డవాడిలా నిర్వికారంగా తనూజని తీసుకుని బయలుదేరాడు. అతనితో పాటు బయలుదేరిన తనూజతో మంజులకానీ, ప్రసాద్ కానీ ప్రేమగా మాట్లాడలేదు. అంటీ ముట్టనట్లు ప్రవర్తించారు. వెళ్ళొస్తాను అని చెప్పినా మంచిది అని ఊరుకున్నారేగానీ ఎప్పటిలా ‘జాగ్రత్త తల్లీ... ఆరోగ్యం జాగ్రత్త, ఏదన్నా కావాలంటే ఫోన్ చేయి’ అంటూ ఆప్యాయతతో కూడిన వీడ్కోలివ్వలేదు. తల్లిదండ్రుల వాలకం చూస్తుంటే తనమీద వాళ్ళిద్దరూ చాలా కోపంగా ఉన్నారని గ్రహించింది తనూజ. అయినా పట్టించుకోలేదు.

"ఉండనీ... నాకేం? వీళ్ళందరికీ కోపం వస్తుందని నాకిష్టంలేని పనెందుకు చేయాలి?' అనుకుని నిర్లక్ష్యంగా వెళ్ళిపోయింది.

కానీ ఇంటికి వెళ్ళాకా రాహుల్ కూడా తనతో ముభావంగా ఉండడం, పడక కూడా సోఫాలోకి మార్చేయడం చూసి ఆమెకి ఒళ్ళు మండిపోయింది.

దిండూ, దుప్పటీ తీసుకుని సోఫాలో పడుకున్న రాహుల్ దగ్గరికి వెళ్ళి మండిపడుతూ అడిగింది, "ఏంటి నీ ఉద్దేశ్యం? నేను పనికిరాకుండా పోయానా? అంటే నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఉంటే ఇలా హింసిస్తావన్నమాట. హు నువ్వేదో పెద్ద ఆదర్శపురుషుడివని మురిసిపోయాను. ఛీ.. నువ్వు కూడా ఇలా ఓ మామూలు మగాడిలా ప్రవర్తిస్తావనుకోలేదు."

రాహుల్ నింపాదిగా అన్నాడు "ఆదర్శ పురుషుడంటే ఎలా ఉండాలి తనూ. నిన్ను ప్రేమగా చూసుకోవడం, నీ స్వేచ్ఛనీ, స్వాతంత్ర్యాన్నీ, నీ అభిప్రాయా లనీ గౌరవించడం, ఇంటి పనుల్లో, సంసారపు బాధ్యతల్లో నీతో సమానంగా భాగం పంచుకోవడం, నిన్ను అర్థం చేసుకుని భర్తగా సహకరించడం ఇవికాక ఇంకేమన్నా ఉంటాయా చెప్పు చేస్తాను. కానీ... కానీ తండ్రి కావాలనుకున్న నా కోరికని శాశ్వతంగా మనసులో పాతేసి ఓ పనికిమాలినవాడిగా బతకమని అంటు న్నావే అది మాత్రం భరించలేకపోతున్నాను."

"అంటే ఏంటి? నువ్వు తండ్రి కానంత మాత్రాన పనికిమాలిన వాడివై నట్టా... అంటే అందరూ నువ్వు మగాడివి కావనుకుంటారని భయమా? నీకా భయం అవసరంలేదు. నేను చెప్తాలే మా ఆయన మగాడే అని."

"తనూజా!" గట్టిగా అరిచాడు రాహుల్. అతని కళ్ళు నిప్పుకణికల్లా ఎర్రగా అయాయి. పెళ్ళి అయిన నాలుగేళ్ళకి అతన్నలా చూస్తుంటే కొంచెం జంకు కలిగింది తనూజకి.

ఆ పిలుపుకీ, ఆ స్వరంలోని తీవ్రతకీ కొంచెం బెదిరింది. ఎప్పుడూ ఎంతో నెమ్మదిగా, స్వరంలో లాలిత్యం నింపుకుని పిలిచే రాహులేనా అనిపించింది ఓ క్షణం వణికిపోయింది కూడా.

"తనూజా... నేనూ మనిషినే నాకూ కొన్ని కోరికలుంటాయి. నీ వ్యక్తిత్వం, నీ అస్తిత్వం కాపాడుకోవాలని నువ్వెంత తపన పడుతున్నావో నాకూ అంతే తపన ఉంటుందని తెలుసుకో. నీ ఆశల్నీ... ఆశయాలనూ నేను మన్నించి గౌరవించినట్టే నువ్వు కూడా నా ఆశల్ని గౌరవించాలన్న చిన్న విషయం నీకు తెలియనందుకు నాకు చాలా బాధగా ఉంది. ఏం? నీ అభిప్రాయలను భర్తగా

నేను గౌరవించాలి, కానీ భార్యగా నా అభిప్రాయాలను నువ్వు గౌరవించవా? చూడు తనూ... గౌరవం, ప్రేమ, అనురాగం, వాత్సల్యం అనేవి ఇచ్చిపుచ్చుకోవాలి. ఎంతసేపటికీ అవి నీ ఆస్తులే అని, అందరూ నిన్ను గౌరవించాలని, ప్రేమించాలని అనుకోవడం మూర్ఖ త్వం. అరే... చిన్నకోరిక... అందరిలా నాకూ నాన్న అనిపించుకోవాలని ఉండడం తప్పా. ఛ... ఈ చిన్న విషయంలో నిన్ను కన్విన్స్ చేయలేకపోయాక ఇంకెందుకు నా బతుకు? మన అనుబంధానికి, ప్రేమకీ, భార్యాభర్తల అన్యోన్యానికీ ఏంటి అర్థం?" బాధగా అన్నాడు.

"అంటే! నేను పిల్లల్ని కనకపోతే మన మధ్య అనుబంధం తెగిపోయి నట్టేనా?"

"ప్లీజ్ తనూ.... నీతో వాదించే ఓపిక కానీ, ఆసక్తికానీ నాకు లేవు. దయ వుంచినన్ను వంటరిగా వదిలెయ్. అయినా పిల్లలు వద్దనుకున్న నీకు నేను మాత్రం ఎందుకు? హాయిగా, స్వేచ్ఛగా వంటరిగా బతుకు. ప్లీజ్" రెండు చేతులూ ఎత్తి దండం పెట్టాడు.

తనూజ విసురుగా గదిలోకి వచ్చింది. లైట్ఆఫ్ చేసి, మంచంమీద వాలిపోయి, 'పోనీ, ఈయన పొందుకోసం నేనేం తపించడంలేదు. నేను కావాలంటే తనే వస్తాడు. ఛ... ఏం మనుషులు? అసలీ మగవాళ్ళకి ఆడదంటే పిల్లల్ని కనిచ్చే యంత్రం అని తప్ప రక్తమాంసాలున్న మనిషిగా గుర్తించరేమో. పిల్లలు, పిల్లలు అని అంత తపిస్తుంటే దేశంలో అనాథలెందరో ఉన్నారు. వెళ్ళి వాళ్ళందరినీ ఎత్తుకుని ముద్దు చేసుకుంటే సరి. వీళ్ళకోసం తను... నో ఒక్కసారి కడుపు వైపు చూసుకున్న తనూజ విరక్తిగా అనుకుంది. నా వల్లకాదు. చటుక్కున దుప్పటి ముసుగేసుకుని పడుకుండిపోయింది.

అయితే డాక్టర్ ఇచ్చిన వారం గడువు దాటిపోయింది. రాహుల్ గాంభీర్యం వదల్లేదు. తనూజతో మాట్లాడడంలేదు. రాత్రిళ్ళు ఆలస్యంగా వస్తున్నాడు. ఇంట్లో భోజనం కూడా చేయడంలేదు. తనూజకి వాంతులవుతున్నా పట్టించుకోవడంలేదు. అతని ప్రవర్తన తనూజకి కోపాన్ని కలిగించినా ఎందుకో ఎన్నడూ తను చూడని మరో రాహుల్ని అలా చూస్తుంటే కొంచెం బాధగా అనిపిస్తోంది. గడ్డం చేసుకో కుండా పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. అతన్నలా చూస్తుంటే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళ మని అడిగే సాహసం కలగడంలేదు. అక్కడికీ తెగించి అడిగింది ఓరోజు, "డాక్టర్ దగ్గరికెళ్ళాలి, మర్చిపోయావా?" అని.

"ఎప్పుడు వెళ్దామంటే అప్పుడు తీసుకెళతాను. నీ ఇష్టం" అన్నాడు

ముక్తసరిగా.

అతను సంతోషంగా తీసికెళ్ళకపోయినా కనీసం నార్మల్‌గా ఉన్నా వెళ్ళచ్చు కానీ, మరీ ఇలా ఉంటే తను అబార్షన్ ఎలా చేయించుకోగలదు అనిపించింది తనూజకి. అందుకే మరో నాలుగు రోజులు వాయిదా వేసింది. ఆ నాలుగు రోజులూ కొంచెం వాంతులు తగ్గినట్టు అనిపించింది. మామూలుగా ఆఫీస్‌కి వెళ్ళసాగింది. కొలీగ్స్ అందరికీ అప్పటికీ విషయం తెలిసిపోయినట్టుంది, అందరూ వచ్చి అభినందించారు. "దానిమ్మపళ్ళు తిను, పళ్ళరసం తాగు, కొంచెం పుల్లటి పదార్థాలు తిను" అంటూ సలహాలిచ్చారు. వాళ్ళ సలహాలను, అభినందనలనూ తిరస్కరించలేకపోయింది.

ఇప్పుడు వెళ్ళాలి, అప్పుడు వెళ్ళాలి అనుకునేలోగానే మూడోనెల దాటింది. రాహుల్‌కి ఎక్కువ రోజులు దూరంగా ఉండలేకపోయింది. ఈ నాలుగేళ్ళుగా ఏనాడూ సరదాక్కూడా తమ మధ్య అభిప్రాయభేదాలు రాలేదు. తనెలా అంటే అలా చేసే రాహుల్ తనకి చీమకుట్టినా, దోమకుట్టినా విలవిల్లాడే రాహుల్ అకస్మాత్తుగా అలా మారిపోవడం జీర్ణం చేసుకోలేకపోయింది. దానికితోడు అటు తల్లిగానీ, ఇటు అత్తగారుగానీ ఎవరూ కూడా ఫోన్ చేయడంలేదు. తననెంతో ప్రేమించే తండ్రి కూడా ఈ పదిరోజులుగా ఒక్కసారి కూడా ఫోన్ చేసి ఎలా వున్నావురా? అంటూ ప్రేమగా పలకరించలేదు. హఠాత్తుగా అందరూ కలిసి తనని వెలేసినట్లు అనిపించింది. అనుకోకుండా తనకెదురైన ఈ విముఖతని తట్టుకునే శక్తిలేదు ఆమెకి. ఒక్కసారిగా తను పూర్తిగా వంటరి అయినట్టుగా అనిపించింది. అందుకే నెమ్మదిగా మనసుకి సర్దిచెప్పుకోవడానికి ప్రయత్నించ సాగింది.

కానీ చిన్నప్పుడు తమింట్లో పనిచేసిన పద్మ ఏడాదికోసారి కడుపుతో ఉండడం, ఓ పిల్లని చంకలో మరో పిల్లాడిని చేతిలో పట్టుకుని పనికి రావడం, వాళ్ళ ఏడుపులూ, ఉచ్చలూ, గోల... గుర్తుకొచ్చి చీదర కలిగేది.

అలాగే బస్సుల్లో, సినిమా హాల్స్‌లో చిన్నపిల్లల్ని ఎత్తుకుని వచ్చే తల్లులంతా కళ్ళముందు కదిలి భయంతో వణికిపోయేది. అమ్మో! నా పరిస్థితి కూడా అలాగే ఉంటుందేమో... అనుకోసాగింది.

***

కన్సీవ్ అయాక అందరమ్మాయిల్లా ఉత్సాహంగా కాకుండా దిగులుగా, చిరాగ్గా ఉన్న తనూజని తరచి, తరచి అడిగి విషయం తెలుసుకున్న కొలీగ్

సుప్రజ తనూజ అభిప్రాయాలు విని మెత్తమెత్తగా చివాట్లు పెట్టింది.

"నువ్వు పిచ్చిదానివా? అసలీ ఆలోచనలు ఎందుకొస్తున్నాయి? నీకు పిల్లల రోగాలు, రొష్టుల గురించి ఆలోచించే ముందు వాళ్ళ చిరునవ్వులూ, చిలిపి అల్లర్లూ, ముద్దుముద్దు మాటలు, తప్పటడుగులు గుర్తుచేసుకో. నీ పిల్లలు అలా నీ ఇంట్లో తప్పటడుగులు వేస్తూ లక్కపిడతలాంటి నోటితో అమ్మా అంటోంటే వినాలని అనిపించడం లేదూ. ఆ మాధుర్య భావనలో, ఆ అనుభూతుల జల్లుల్లో నిలువునా తడిసిపోవాలనిపించడం లేదూ. నాకెందుకో నీ మెంటల్ కండిషన్ మీద అనుమానంగా ఉంది" అంది.

తనూజ మండిపడింది. "అంటే నీ ఉద్దేశం ఏంటి? నాకు పిచ్చి ఉందను కుంటున్నావా?"

"అంతేగా, నార్మల్‌గా ఆలోచించేవాళ్ళెవరూ నీలా ఆలోచించరు."

ఆ అమ్మాయితో చర్చించాక నిజంగానే 'నేను నార్మల్‌గా లేనా?' అన్న అనుమానం కలిగింది తనూజకి. దాదాపు నెల రోజులపాటు ఇదే విషయం తీవ్రంగా ఆలోచించి  ఓ నిర్ణయానికి వచ్చింది.

పోనీలే ఇదేదో కానిస్తే సరిపోతుంది. పిల్లలుంటే బాగానే ఉంటుంది. కానీ అబ్బా! వాళ్ళకి సేవలు చేయాలి. వాళ్ళ కేర్ తీసుకోవాలి. తన యాక్టివిటీస్, ఫ్రీడం అన్నీ వదులుకోవాలి అనిపించినా నెమ్మదిగా ముందటి నిర్ణయం మార్చుకోడానికి ప్రయత్నించసాగింది.

ఆరోజు రాత్రి రాహుల్ దగ్గరకి వెళ్ళి అతని పక్కన కూర్చుని నెమ్మదిగా అంది. "ఇదేం బాగాలేదు రాహుల్. నన్ను సాధించడానికి కాకపోతే నువ్వీ మౌన వ్రతం చేయడం దేనికి? నీకు పిల్లలు కావాలి అంతేనా? సరే... నీకోసం ఒక్కర్ని కంటాను సరేనా? అది ఆడపిల్లా, మగపిల్లాడా అనకూడదు. నేను ఎవర్నికంటే వాళ్ళని యాక్సెప్ట్ చేయాలి."

ఊహించని పరిణామానికి రాహుల్ ఉలిక్కిపడ్డాడు. ఆమె అలా తన పక్కన కూర్చుని ఆ మాటలంటోంటే అది కలో, నిజమో తేల్చుకోవడానికి అతనికి కొన్ని క్షణాలు పట్టాయి. అర్థం అయ్యాక ఆమె మాటలు అతనికి చాలా సంతోషాన్ని కలిగించాయి. తనూజ ఈమాత్రం అనుకూలంగా మారడం తృప్తిని కలిగించింది. అయినా కొంచెం బెట్టుగా "నాకోసం నువ్వెందుకులే తనూజా కష్టాలు భరించడం" అన్నాడు.

"ఈ సినిమా డైలాగులు, హిపోక్రసీ మానెయ్. నీకు పిల్లలు కావాలి

అంతేగా... సరే అన్నాను. అబార్షన్ సంగతి మర్చిపో... కానీ గుర్తుంచుకో... నీ మౌనవ్రతం చూసి, నీ సాధింపు చూసి నేనేం బెదిరిపోయి ఒప్పుకోవడంలేదు. నా అంతట నేనే ఒప్పుకుంటున్నాను."

ఎలాగైతే ఏం? ఒప్పుకుంది అది చాలు తనకి అనుకున్నాడు రాహుల్. ఆమె చేయి తన చేతిలోకి తీసుకుని నమ్మలేనివాడిలా అడిగాడు "మనస్ఫూర్తిగా అంటున్నావా?"

"నమ్మకం లేదా? నువ్వు నమ్మాలంటే నేనేం చేయాలి?"

"ఏమీ వద్దు. పద... తయారవు. ఇవాళ ఇద్దరం ఏదన్నా హోటల్లో భోం చేద్దాం" అన్నాడు హుషారుగా.

"ఊహూ... అమ్మావాళ్ళింటికి వెడదాం. ఆవిడగారు కూడా అలిగినట్టు న్నారు ఫోన్ కూడా చేయడంలేదు" అంది.

"నీ ఇష్టం" అన్నాడు రాహుల్. ఆ తరువాత ఇద్దరూ బయలుదేరి మంజుల దగ్గరికి వెళ్ళారు.

***

అయిష్టంగా, అసంతృప్తిగా గర్భం మోయడానికి తనూజ సిద్ధపడిన దగ్గర్నించీ అందరి ప్రవర్తనల్లో ఎంతో మార్పొచ్చింది. అటు తల్లీతండ్రీ, ఇటు రాహుల్... పూవులా చూసుకుంటున్నారు. ఊరినుంచి అత్తగారు రకరకాల పచ్చళ్ళు, పిండివంటలు చేసి పంపించింది. ఇంట్లో పనంతా రాహులే చేస్తున్నాడు. ఏది ఎలా ఉన్నా ఈ వంకతో తనకి రాణీయోగం పట్టిందని మురిసిపోయింది తనూజ.

ఏడో నెల వచ్చింది. అత్తగారు, తల్లి కలిసి ఆర్భాటంగా సీమంతం చేశారు. అలా బాహాటంగా మా అమ్మాయి కడుపుతో ఉంది అని అందరికీ చాటింపు వేస్తున్నట్టుగా చేస్తున్న ఆ ఆర్భాటం తనూజకి చికాకు కలిగించింది. కానీ తల్లి సంతోషం కోసం ఒప్పుకుంది. అయితే ఆ రోజు నిలువుటద్దంలో తనని తను చూసుకున్న తనూజకి మొదటిసారిగా తనలో ఉన్న అందం కనిపించింది. ఎప్పుడూ షల్వార్, కమీజుల్లో నుదుట చిన్న స్టిక్కరుతో, మెడలో పుస్తెల తాడు మాత్రం వేసుకుని సింపుల్‌గా తిరిగే తనూజ ఆ రోజు పెద్ద పూలజడ, మెడనిండా నగలు, పట్టుచీర, కళ్ళకు కాటుక, చేతినిండా గాజులు వేసుకుని ఎంతో అందంగా ఉంది. నిండుగా, అందంగా ఉన్న తన ఆకారాన్ని చూసుకుంటే చిత్రంగా అనిపిం చింది ఆమెకి.

తనూజకి నెలలు నిండుతున్నాయి. ఆఫీసుకు సెలవు పెట్టి పుట్టింటికి

వచ్చింది. కాలు కదపనివ్వకుండా మంజుల సేవలు చేస్తోంది. ఏది కావాలంటే అది క్షణాల మీద అమరుతోంది.

నెమ్మదిగా కడుపులో పాపాయి కదలికలు మొదలవుతుంటే తనూజకి ముందు భయం, చికాకు వేసింది. "ఏమిటమ్మా ఈ న్యూసెన్సు... నాతోపాటు కదుల్తుందే ఈ పాప. నోరు మూసుకుని కూర్చోవచ్చుగా" అంది.

"పాప కాదు... నువ్వు నోర్మూసుకో" అంటూ మంజుల కన్నెర్ర చేసేటప్పటికి చేసేదిలేక మాట్లాడకుండా ఊరుకుంది. కానీ ఆ తరువాత ఆ కదలికలు ఆమె గుండెల్లో చిత్రమైన పులకింతలు కలిగించసాగాయి. బుజ్జిబుజ్జి పాదాలతో పాపాయి గర్భగోడలు పగలగొట్టుకుని బైటకి రావడానికి విశ్వప్రయత్నం చేస్తున్నట్లుగా అనిపించి ఏవిటో ఈ తొందర? అనుకుంది మురిపెంగా. ఆ తరువాత అవును... పాపాయి త్వరగా బైటికి వస్తే బాగుండును. ఎలా ఉందో... తనలా ఉందో, రాహుల్‌లా ఉందో... తెల్లగా ఉందో, నల్లగా ఉందో అని పాపాయి భూమ్మీద పడే మధుర క్షణం కోసం ఎదురుచూడసాగింది.

ఆరోజు రానే వచ్చింది. ఉదయాన్నే నలతగా ఉన్న కూతుర్ని తక్షణం హాస్పిటల్‌కి తీసుకెళ్ళింది మంజుల. ఊరి నుంచి అత్తగారు కూడా వచ్చింది. రాహుల్ ఆఫీసుకి సెలవుపెట్టి హాస్పిటల్లో ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

పెయిన్స్ ప్రారంభం అవడంతో తనూజని లేబర్ రూంకి తీసుకెళ్ళారు. ఆ నొప్పులు భరించలేక తనూజ వెర్రికేకలు పెట్టసాగింది. "డాక్టర్! నేను భరించలేను. ముందీ పాపను బయటకు తీయండి" అంటూ పిచ్చిపిచ్చిగా అరవసాగింది. మంజుల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "పాపం పిచ్చిది... అందరూ కలిసి దాన్ని సాధించి తొమ్మిది నెలలు మోసేలా చేయగలిగారు కానీ ఈ ప్రసవ వేదన తమలో ఎవరు భరిస్తారు? భరించాల్సింది నా కూతురేగా. పాతికేళ్ళు లేని పసిది మరో పసిగుడ్డుకి జన్మనివ్వడం అంటే మాటలా. ఈ యజ్ఞంలో నా కూతురికి ఏ ఆపదా కలక్కుండా కాపాడు తండ్రీ! నా బిడ్డకు సుఖప్రసవం అవాలని దీవించు. నన్ను క్షమించు తండ్రీ! పాపిష్టిదాన్ని. నా బిడ్డని అనవసరంగా బాధపెట్టాను. ఎంత బాధపడిందో పిచ్చితల్లి" అనుకుని బాధపడసాగింది. లోపల నుంచి తనూజ అరుపులు, ఏడుపు వినిపిస్తోంటే మంజుల తల్లి మనసు విలవిల్లాడసాగింది.

దాదాపు నాలుగు గంటల తరువాత తనూజ అరుపులు ఆగిపోయాయి. పాపాయి కేర్‌మన్న శబ్దం వినిపించి కారిడార్‌లో నిరీక్షిస్తున్న వాళ్ళంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రసవ పోరాటంతో అలసి, సొలసిన తనూజ చెవులకి ఆ శబ్దం శంఖా రావంలా, గాలికి కదుల్తోన్న గుడిగంటల సవ్వడిలా సుతారంగా, మధురంగా వినిపించింది. అలసిన కనురెప్పలు వాలిపోతోంటే నెమ్మదిగా కళ్ళు తెరిచి "డాక్టర్... ఏ పాప?" అడిగింది.

"ఆడపిల్లమ్మా!" డాక్టర్ తనూజ దగ్గరగా వచ్చి మొహం మీద పడిన జుట్టు సవరిస్తూ మృదువుగా చెప్పింది.

తనూజ మొహంలో మెరిసిన మెరుపు చూసి డాక్టర్ చిరునవ్వుతో అడిగింది. "నువ్వు దరిద్రం అని తీసిపారేయమన్న పాపని చూస్తావా?"

తనూజ చిన్నగా తల ఊపింది.

"చూద్దువుగాని, సిస్టర్ స్నానం చేయించి తీసుకువస్తుంది. నీకెలా ఉంది" పల్స్ చూస్తూ అడిగింది.

తనూజ నీరసంగా నవ్వింది. "చాలా సంతోషంగా ఉంది."

"గుడ్ చూశావా? కొంచెం సహనం వహిస్తే ఎంత గొప్ప విజయం సాధించ గలమో అర్థం అయిందా? తనూజా... ఇది స్త్రీ జీవితంలో ఎదురయ్యే అతి ముఖ్యమైన మధురాతి మధురమైన సన్నివేశం. ఎంత అవివేకంతో దీన్ని మిస్ అయ్యేదానివో తెలుసా? ఓకే టేక్ రెస్ట్" అంటూ ఇంజక్షన్ చేసింది.

కొంతసేపటికి తనూజ కళ్ళు మూతలుపడ్డాయి.

తిరిగి మెలకువ వచ్చేసరికి పక్కమీద మెత్తగా, గులాబీరేకులా పాపాయి స్పర్శ తగిలింది. చటుక్కున్న కళ్ళు తెరిచింది. తెల్ల గులాబీలా ఉన్న చిన్న పాప కళ్ళు మూసుకుని, గుప్పిళ్లు మూసుకుని అమ్మ పక్కలో వెచ్చగా పడుకుంది.

"ఎలా ఉంది తనూ!"ఆప్యాయంగా అడుగుతున్న రాహుల్ని, "నీ కూతురు అచ్చు నీలాగే ఉంది" అంటోన్న మంజుల మాటల్ని పట్టించుకోకుండా తన గర్భగుడి నుంచి బైటకి వచ్చి అమాయకంగా నిద్రపోతున్న ఆ చిన్నారిని అపు రూపంగా చూస్తూ "ఈ అమాయకపు పాపాయేనా నా కడుపులో అంత అల్లరి చేసింది" అనుకుంటూ గుండెల్లోంచి వెల్లువెత్తుతోన్న మమతానురాగాలతో మైమరిచి పోయి తన చేతిని పాపాయి వంటిమీద సున్నితంగా వేసింది తనూజ.

***

***(మార్చి 2004, విపుల)***